# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 10 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4




మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు బేగంపేట ఎయిర్ పోర్ట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి వీడ్కోలు పలికారు.

## యుద్ధ పరిస్థితులపై తీవ్ర ఆందోళన

- ప్రస్తుత పరిస్థితులను ప్రధాని మోదీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు
- భారతీయుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత
- పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. యుద్ధ పరిస్థితులను భారత్ నిరంతరం అంచనా వేస్తోందని, చర్చలు మరియు దౌత్యపరమైన చర్యల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని భారత్ విశ్వసిస్తోందన్నారు.పార్లమెంట్‌లోని రెండు సభల్లోనూ ఈ విషయంపై ప్రకటన చేసిన ఆయన, పశ్చిమాసియా ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని జైశంకర్ తెలిపారు. సంబంధిత శాఖలన్నింటికీ తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించినట్లు చెప్పారు. పశ్చిమాసియాలో శాంతికి విఘాతం కలిగితే ప్రపంచవ్యాప్తంగా ప్రభావం ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ఈ ఘర్షణల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. అయితే భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఇంధన భద్రత, వాణిజ్య లక్ష్యాల విషయంలో రాజీ పడబోమని తెలిపారు. చమురు లభ్యత, ధరల నియంత్రణ కోసం దౌత్యపరంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జైశంకర్ తెలిపారు. గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 67 వేల మంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చినట్లు వెల్లడించారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగే అవకాశంపై భారత్ ముందుగానే ఆందోళన వ్యక్తం చేసినట్లు జైశంకర్ తెలిపారు. ఫిబ్రవరి 20న ప్రభుత్వం ప్రకటన విడుదల చేసి అన్ని పక్షాలు సహనంతో వ్యవహరించాలని కోరిందని చెప్పారు. 2026 ఫిబ్రవరి 28న కూడా భారత్ అధికారికంగా ఆందోళన వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. ప్రాంతంలో పెరుగుతున్న ప్రాణనష్టం, అలాగే ఇరాన్లో ఏర్పడిన సంక్షోభం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని ఆయన అన్నారు.

# భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

- కొత్త నేరాలపై సరికొత్త అస్త్రాలు సిద్ధం చేయండి
- అందుకు సీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ
- అధికారుల పనితీరుకు ఏ, బీ, సీ గ్రేడింగ్.. దాని ఆధారంగానే ఇకపై పోస్టింగ్‌లు
- సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్--2026



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భవిష్యత్తులో రాబోయే సవాళ్లను ఎదుర్కొనడానికి పోలీసు శాఖ సర్వసన్నద్ధం కావలసిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాబోయే 25 సంవత్సరాలకు అవసరమైన కార్యాచరణపై చర్చించి ప్రణాళికలు రూపొందించుకోవాలని పోలీసు శాఖకు సూచించారు.ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో సుదీర్ఘ కాలం తర్వాత నిర్వహించిన పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఫ్యూచర్ రెడీ కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల పోలీసు ఉన్నతాధికారులు ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు.పోలీసింగ్‌కు సంబంధించి భవిష్యత్తులో చేపట్టాల్సిన మార్పులు, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యల ఆవశ్యకతను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త తరహా నేరాలు పెరగకుండా సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని సీఎం గారు చెప్పారు. నేరాలను నిరోధించడం, నేరస్థులను త్వరగా గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరహా టెక్నాలజీని వినియోగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ పోలీస్ అకాడమీ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు.

"శాంతి భద్రతలు కాపాడటంలో దేశంలో తెలంగాణ ఒక మెరుగైన రాష్ట్రంగా గుర్తింపు పొందింది. అందుకు పోలీసు శాఖను అభినందిస్తున్నా. అయితే, 2047 లక్ష్యాలను చేరుకోవడానికి మనమంతా ఎంపవర్ కావలసిన అవసరం ఉంది. ఫ్యూచర్ రెడీ కోసం పోలీసు శాఖ చేసిన ప్రతిపాదనలు, అనుసరించాల్సిన విధానం, దానికి చట్ట బద్ధత కల్పించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శితో కూడిన కమిటీని నియమిస్తాం. ఆర్థిక, న్యాయ, సాంకేతిక, పరిపాలన పరమైన అంశాలను చర్చించిన తర్వాత చట్టరూపం కల్పించే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుంది. పోలీసు శాఖను ఎంపవర్ చేయడానికి అవసరమైన నిధులు కేటాయించడంలో ఇబ్బంది లేదు. కానీ ఫలితాలొచ్చే విధంగా ఆ నిధులు సద్వినియోగం అవుతాయన్న ఒక విశ్వాసం కల్పించాలి.మనకున్న ఫిజికల్ క్రైమ్, మన ఎకోసిస్టమ్ ఆధారంగా మాన్యువల్స్ రాసుకున్నాం. ఇప్పుడు పరిస్థితుల్లో చాలా మార్పులొచ్చాయి. నేర స్వరూపమే పూర్తిగా మారిపోయింది. సైబర్ క్రైమ్, డ్రగ్స్ వంటి కొత్త సమస్యలొచ్చాయి.

పోలీసు అధికారులు మొట్టమొదట సమస్య ఏంటో అర్థం చేసుకోగలగితే సగం సమస్య

మిగితా 4వ పేజీలో

## రాజ్యసభకు సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ మరియు వేం నరేందర్ రెడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసెంబ్లీ ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనంతరం వారిద్దరికీ రాజ్యసభ సభ్యులుగా నియామక పత్రాలను అందజేశారు.రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వేం నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎంపీగా చేయడానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నేతలందరికీ ధన్యవాదాలు చెప్పారు.

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సాయన్న కూడా నామినేషన్ వేశారు. అయితే నిబంధన ప్రకారం పది మంది ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో స్క్రూటినీ దశలోనే సాయన్న నామినేషన్ తిరస్కరించబడింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మార్గం సుగమమైంది. దేశంలోని ప్రముఖ సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ మరోసారి తెలంగాణ నుంచి రాజ్యసభకు అవకాశం కల్పించింది. వేం నరేందర్ రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఆయనకు ఈ అవకాశం దక్కిందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి ధన్యవాదాలు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను రాజ్యసభలో ప్రస్తావిస్తూ నిధుల కోసం గళమెత్తి పోరాడతాం. కాంగ్రెస్ అధిష్ఠానం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వను" అని పేర్కొన్నారు.

## రోడ్లు విస్తరించాలి.. చెరువులు పునరుద్ధరించాలి..

### హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కూకట్‌పల్లిలో హైడ్రా పునరుద్ధరించిన నల్లచెరువు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో రోడ్లను విస్తరించుకోవడం, చెరువులను పునరుద్ధరించడం, నాలాల ఆక్రమణలను తొలగించడం ద్వారా నగరాన్ని అభివృద్ధి చెందిన సురక్షిత నగరంగా తీర్చిదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించిన నల్లచెరువును ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు.

మిగితా 4వ పేజీలో

## ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ

**స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టాలి**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**క్రీడా శాఖపై సమావేశం**

వివరాలు 4వ పేజీలో

## సెక్యులరిజానికి కేరాఫ్ చిరునామా కాంగ్రెస్

- ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీనే
- సర్వమతాలను సమానంగా చూస్తాం
- ముస్లింల రక్షణతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా నిలబడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.భారతదేశంలో సర్వమతాలను సమానంగా చూస్తూ వారి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కుడా కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని ఆయన స్పష్టం చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నేత సర్వోత్తం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి,మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదితా లక్షాది ,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో సెక్యులరిజానికి పెద్ద పీట వేస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నన్నారు. లోకసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ మొదలు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వరకు ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆయన చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ చిరునామాగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. ముస్లింల రక్షణతో పాటు వారి వారి అభివృద్ధితో పాటు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు పెద్ద పీట వేశాయని ఆయన గుర్తుచేశారు.

ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొనడడం ఆనంద దాయకంగా ఉందన్నారు. సూర్యాపేట లో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా మంత్రిగా నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో షాధిఖాన, కమ్యూనిటి హాల్,ఖబరస్తాన్ వంటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

**రాహుల్ బంధు' పేరుతో**

## రైతు బంధు నిధుల మళ్లింపు..



- అందుకే నాలుగు సార్లు రైతుబంధును ఎగ్గొట్టారు
- రైతుల నిధులతో కాంగ్రెస్ రాజకీయాలు
- ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతాం..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాహుల్ బంధు' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారని, రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధు నిధులను అదే పథకానికి మళ్లిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. రైతుల కోసం ఇచ్చే రైతు బంధు నిధులతోనే రాహుల్ బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని టిఆర్ఎస్ భవనంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కుటుంబానికి అవసరం వచ్చినప్పుడల్లా తెలంగాణ రైతుల నిధులను పంపించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సంవత్సరానికి సుమారు వెయ్యి కోట్ల రూపాయలను రాహుల్ గాంధీకి పంపే విధంగా రాహుల్ బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధును పక్కన పెట్టి ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీఎం పీఠాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని రైతులు తమకు రైతు బంధు అందుతుందని, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా నిధులను పెంచి ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారని,అయితే ఇప్పటికే పలుమార్లు రైతు బంధు చెల్లింపులను ప్రభుత్వం ఆలస్యం చేసిందని, ఈసారి కూడా రైతులను నిరాశపరిచిందని మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన నిధులను పక్కన పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

మిగితా 4వ పేజీలో



**గత ప్రభుత్వం వల్లే**

## కేంద్ర నిధులు పెండింగ్


- మంత్రి సీతక్క

**బలగం టీవి, హైదరాబాద్**

మార్చి 2026 (ఆర్థిక సంవత్సరం) ముగిసేలోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో తెచ్చుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ వినియోగం, వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. విభాగాల వారీగా అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు మంత్రికి సమర్పించగా, వాటిలో పలు మార్పులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయనీ, ఒక్క రూపా యి కూడా లాప్స్ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధుల కోసం అవసరమైన యుటిలిటీ సర్టిఫికేట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధీ హామీ పథకం స్థానంలో కేంద్రం ప్రవేశ పెట్టిన వీబీజీ ఆర్‌ఏఏఎంజీ చట్టానికి సంబంధించి ఇంకా రూల్స్ ఫ్రేమ్ కాలేదనీ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధీ కల్పన కోసం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనా లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2) నాటికి ఈ భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవికాలంలో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా వాగులు, వంకలు, తోగులపై చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

## రేపు రాష్ట్ర గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా రేపు భాద్యతలు చేపట్టనున్నారు. హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ ఆయనచే ప్రమాణం చేయించనున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు జరగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శుక్లాను తెలంగాణ నూతన గవర్నర్‌గా, తెలంగాణ గవర్నర్‌గా ఉన్న జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. కాగా ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

శివ్ ప్రతాప్ శుక్లా రాష్ట్రానికి 5వ గవర్నర్ కాగా అంతకు ముందు నలుగురు గవర్నర్లు బాధ్యతలు నిర్వహించారు. 2014లో రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొదటి గవర్నర్‌గా ఈఎస్ఎల్. నర్సింహన్ సుదీర్ఘ కాలం పని చేశారు. ఆయన ఏకంగా 5 సంవత్సరాల 97 రోజులు, ఆ తర్వాత తమిళిసై సౌందర్‌రాజన్ 4 సంవత్సరాల 193 రోజులు పని చేశారు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి, అప్పటి మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సీపీ.రాధాకృష్ణన్ తాత్కాలిక గవర్నర్‌గా 132 రోజులు, ప్రస్తుతం బదిలీపై మహారాష్ట్రకు వెళుతున్న జిష్ణుదేవ్ వర్మ ఏడాది 221 రోజులు పని చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచన లేదు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటినప్పటికీ, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచన ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. సాధారణ ప్రజలపై భారం పడకుండా ఇంధన ధరలను స్థిరంగా ఉంచే నిర్ణయాన్ని ప్రభుత్వం పునరుద్ఘాటించింది.పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీ యంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను పెంచే "తక్షణ ప్రణాళికలు లేవు" అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం భారత్ వద్ద సుమారు 25 రోజుల పాటు సరిపడే ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని, తక్షణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవి సరిపోతాయని అధికారులు పేర్కొన్నారు. సముద్ర మార్గంలో రష్యా నుంచి వచ్చే చమురు సరఫరాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఇటీవలి రెండు నుంచి మూడు సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థలు లాభాలు సాధించాయని, పెరుగుతున్న ఖర్చులో కొంతభాగాన్ని అవే భరించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. 2022లో రష్యా--ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా ఇదే విధంగా కంపెనీలు అధిక చమురు ధరల ప్రభావాన్ని కొంత వరకు తట్టుకున్నాయని గుర్తు చేశారు.

ఇక దేశీయంగా ఇంధన సరఫరా పరిస్థితి సౌకర్యంగా ఉండటంతో డీజిల్, పెట్రోల్, జెట్ ఇంధన ఎగుమతులను కూడా నిలిపివేయే ఆలోచన ప్రస్తుతం లేదని కేంద్ర వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా భారత్ రోజుకు సుమారు 1.2 మిలియన్ బ్యారెల్స్ పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.అంతేకాకుండా ముడి చమురు ధరలను నియంత్రించేందుకు జీ7 దేశాలు వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాలనే ప్రయత్నంలో భారత్ పాల్గొనదని కూడా అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం ఒక దశలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 119 డాలర్ల వరకు చేరి, తర్వాత మళ్లీ 100 డాలర్లకు పైగా స్థిరపడింది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్ పరిస్థితులపై చర్చించేందుకు చమురు మంత్రి హర్దీప్ సింగ్ పూరి అంతర్జాతీయ ఇంధన సంస్థ కార్యనిర్వాహక డైరెక్టర్ ఫాతిహ్ బిరోల్‌తో కూడా మాట్లాడనున్నారు.



TEHRAN TIMES

Trump, Look Them in the Eyes

## 'ట్రంప్... వారి కళ్లలోకి చూసి చెప్పండి'

- ఈ శీర్షికన విద్యార్థినుల ఫొటోలను ఫస్ట్‌పేజీలో ముద్రించిన టెహ్రాన్ టైమ్స్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఇరాన్‌లోని దక్షిణ పట్టణం మినాబ్‌లో ఉన్న ఒక ప్రాథమిక పాఠశాలపై జరిగిన క్షిపణి దాడిలో మృతి చెందిన చిన్నారుల చిత్రాలతో ఇరాన్ ప్రభుత్వ మద్దతు ఉన్న ఆంగ్ల దినపత్రిక టెహ్రాన్ టైమ్స్ మొదటి పేజీ నిండిపోయింది. "ట్రంప్... వారి కళ్లలోకి చూసి చెప్పండి" అనే శీర్షికతో పత్రిక

మిగితా 4వ పేజీలో

## బాలికపై లైంగికదాడి

- నిందితుని అరెస్ట్, రిమాండ్
- వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో ఘటన

**బలగం టీవి, వికారాబాద్**

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలో బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో నిందితుడిని పోలీ సులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం మోమిన్‌పేట్ మండలానికి చెందిన బాలిక (7వ తరగతి విద్యార్థిని) గతేడాది దీపావళి సెలవుల సమయంలో హాస్టల్ నుంచి ఇంటికి వచ్చి, అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటోంది. ఇటీవల ఆమె అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఆమె గర్భవతి అయినట్టు గుర్తించారు. దాంతో కుటుంబ సభ్యులు విచారణ చేయగా, వారి ఇంటికి సమీపంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న వ్యక్తి బాలికను మోసం చేసి, ఆమెపై లైంగికదాడికి పాల్పడినట్టు తేలింది. దాంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా, డీఎస్పీ ఎన్.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సీఐ జి.వెంకట్, వారి సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఉద్దాల మాణిక్యంను అరెస్టు చేశారు. నిందితుడు సైదలిపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. జడ్జి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బాలికల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు హాస్టల్స్ లేదా పాఠశాలలకు వెళ్లే సందర్భాల్లో వారి రాకపోకలపై తగిన పర్యవేక్షణ అవసరమని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

# ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి..



- ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి..
- నిరుపయోగ వస్తువులు, చెత్తా చెదారం తొలగించాలి..
- పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల కార్యక్రమాల అమలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ఆయా శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ప్రతి జిల్లా కార్యాలయం, సిరిసిల్ల, వేములవాడ, ఆయా ప్రాంతాల్లోని జిల్లా కార్యాలయాలు, మున్సిపల్, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్వచ్ఛత.. పరిశుభ్రత పనులు పక్కాగా చేయాలని, ఆయా శాఖల అధికారులు, మండల అధికారులు పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో నిరుపయోగ వస్తువులు, చెత్తాచెదారం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 179 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు

# పెరిగిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి..



- దేశం కోసం ధర్మం కోసం అంటూ పేద ప్రజలపై ధరల భారం మోపి..
- అదాని అంబానీ లకు లాభం చేయడం మోడీ విధానం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం సోమవారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ.. గతంలో యూపీఏ ప్రభుత్వం వంట గ్యాస్ ధరను రూ.50 పెంచినప్పుడు తీవ్రంగా విమర్శలు చేసిన నరేంద్ర మోడీ, ఇప్పుడు సిలిండర్ ధరలు వెయ్యి రూపాయలకు పైగా పెరిగినా పేద ప్రజల కష్టాలు పట్టించుకోవడం లేదని అన్నారు. రోజువారీ కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

దేశం కోసం, ధర్మం కోసం అంటూ ప్రజలను మభ్యపెడుతూ, పెద్ద పెట్టుబడిదారులకు లాభం చేకూరే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. ఒకవైపు ప్రజల ఆదాయం తగ్గిపోతుండగా, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. పెరిగిన ధరల కారణంగా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురై అప్పులపాలవుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు రేపుతున్నారని, ఇటువంటి విధానాలను ప్రజలు ఎక్కువకాలం సహించరని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, జిల్లా కమిటీ నాయకులు శ్రీరాముల రమేష్ చంద్ర, జిల్లా నాయకులు మిట్టపల్లి రాజమల్లు, ఎలిగేటి రాజశేఖర్, సిరిమల్లె సత్యం, రవి, బెజగం సురేష్, ఆడెపు రజిత, కుమ్మరికుంట కిషన్, జిందం కమలాకర్, కోలా శ్రీనివాస్, స్వర్గం శేఖర్, శ్రీరాముల కవిత తదితరులు పాల్గొన్నారు.

# సెస్ కార్మికుల విధుల బహిష్కరణను విజయవంతం చేయండి..

- టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సెస్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 72 గంటలపాటు విధులను బహిష్కరిస్తూ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి తెలిపారు. మార్చి 11వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుండి మార్చి 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు సెస్ కార్మికులు విధులను బహిష్కరిస్తారని ఆయన వెల్లడించారు. సెస్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం మరియు పాలకవర్గం మొండి వైఖరి ప్రదర్శిస్తున్నాయని ఆయన విమర్శించారు.

ఈ నేపథ్యంలో వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు, సిరిసిల్ల జిల్లాలోని గ్రామ సర్పంచ్‌లకు, సిరిసిల్ల మరియు వేములవాడ మున్సిపల్ చైర్మన్‌లకు, సెస్ చైర్మన్, ఎండీ, డైరెక్టర్లు మరియు ఇతర అధికారులకు 72 గంటల విధుల బహిష్కరణ నిరసన కార్యక్రమంపై మెమొరాండాలు అందజేసినట్లు తెలిపారు. సెస్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు చైర్మన్, ఎండీ, కమిషనర్ మరియు కలెక్టరేట్ అధికారులకు లేఖలు ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈ 72 గంటల విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సిరిసిల్ల జిల్లాలోని ప్రజలు, పవర్లూమ్స్ కార్మికులు, రైతులు, వినియోగదారులు మరియు వ్యాపారస్తులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ 72 గంటల నిరసన కార్యక్రమంలో ఏదైనా అనుకోని పరిణామాలు చోటు చేసుకుంటే దానికి పూర్తి బాధ్యత సెస్ ఎండీ మరియు పాలకవర్గానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీయూఈఈయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ నాయక్, జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి పట్టివేత.. ఇద్దరు యువకుల అరెస్ట్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మండలంలో గంజాయి సేవిస్తూ, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సిఐ కదిరె నాగేశ్వరరావు తెలిపారు. రామోజీపేట గ్రామానికి చెందిన చింతమడక అజయ్, పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన కోడిముంజ సాయి అనే ఇద్దరు స్నేహితులు గత కొంతకాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. తాము సేవించడమే కాకుండా, చుట్టుపక్కల గ్రామాల్లోని యువతకు గంజాయిని విక్రయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. అనంతారం శివారులో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి 65 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ అనంతరం వారిని జ్యుడీషియల్ కస్టడీ నిమిత్తం రిమాండ్‌కు తరలించారు.



## కల్లుగీత కార్మికుడు సాయి కిషన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

- తాటిచెట్టుపై నుంచి పడి మరణించిన గౌడన్న కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండ
- రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఇటీవల తాటిచెట్టు పైనుండి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన గీత కార్మికుడు సాయిలి కిషన్ గౌడ్ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. ఈ విషాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, బాధిత కుటుంబ సభ్యులను నేరుగా కలిసి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడు కిషన్ గౌడ్ కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేటీఆర్, వారిలో ధైర్యం నింపారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ, కిషన్ గౌడ్ ఇద్దరు పిల్లల పేరు మీద చెరో లక్ష రూపాయల చొప్పున, మొత్తం రూ. 2 లక్షల రూపాయలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఈ మేరకు డిపాజిట్ పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెక్కాడితే గానీ డొక్కాడని గీత కార్మికుల జీవితాల్లో ఇలాంటి ప్రమాదాలు జరగడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి అందాల్సిన ఎక్స్‌గ్రేషియా మరియు ఇతర సహాయ సహకారాలు త్వరితగతిన అందేలా చూడాలని స్థానిక నాయకులను, అధికారులను ఆయన ఆదేశించారు.




## సిరిసిల్లలో ఘనంగా 5కే రన్ కార్యక్రమం..

- పజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక.. స్వచ్ఛత దిశగా అడుగులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సిరిసిల్ల పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం రోజున ఉదయం అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు 5కే రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. బతుకమ్మ ఘాట్ వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో భాగంగా పారిశుధ్య నిర్వహణకు ప్రతి పౌరుడు బాధ్యతగా సహకరించాలని కోరారు. గతంలో సిరిసిల్ల పట్టణం సాధించిన అవార్డులను మళ్లీ సాధించేందుకు ప్రజలందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త ను పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో సిరిసిల్ల పట్టణాన్ని స్వచ్ఛమైన, పర్యావరణ హిత పట్టణంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిల్ సభ్యులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ అధికారులు,పట్టణ ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం.



- మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటించారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురం మారుపాక చీర్లవంచ గుర్రవానిపల్లి, కోడుముంజ గ్రామాల్లో 50 లక్షలతో ఐదు మహిళా సమైక్య సంఘం నిర్మాణానికి విప్ అది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నాయని అన్నారు. మహిళలు సాధికారత సాధించే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు.మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా, ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని అందులో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పించారని అన్నారు.

గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి మహిళా తల్లులను లక్ష అధికారులు చేయాలని పావలా వడ్డీ రుణాలు అందించి మహిళా సంఘాలకు బలమైన ఊతమిచ్చారని,మహిళలను లక్ష్యాధికారులుగా తీర్చిదిద్దాలని సంకల్పించారని అన్నారు. అయితే గత ప్రభుత్వం మహిళా సంఘా లను పట్టించుకోకుండా, సభ్యులను కేవలం సమావేశాలకు మాత్రమే పరిమితం చేసిందని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇప్పటి వరకు మూడు సార్లు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశామని అన్నారు. మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి పథకం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయని అన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో వివిధ క్రీడలు, రక్షణ, పలు రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను కీర్తిస్తూ చంద్రంపేటకు చెందిన వెల్ది రేఖ మూడు నెలల పాటు శ్రమించి రూపొందించిన నారీశక్తి చీరను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం(టీడీఎఫ్) ఆద్వర్యంలో వనిత చేయూత.. మహిళా సాధికారత కింద ముస్తాబాద్ మండలానికి చెందిన మహిళలకు కుట్టు శిక్షణ అందించి.. వారికి సర్టిఫికెట్లు, కుట్టు మెషిన్లు కలెక్టర్ చేతుల మీదుగా అపెరల్ పార్క్ లో అందజేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కుట్టు శిక్షణ పొందిన మహిళలు నేర్చుకున్న మెళకువలు ఉపాధి పొందడంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, టీడీఎఫ్ అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘చలో గన్ పార్క్’ను విజయవంతం చేయండి

- 250 గజాల నివాస స్థలం.
- నెలకు రూ. 20,000 పెన్షన్.
- ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు.
- గుర్తింపు కార్డులు మరియు హెల్త్ ఇన్సూరెన్స్.
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పిలుపు...




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను విస్మరించడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఈ హామీల అమలులో జాప్యం జరుగుతోందని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే వరకు విశ్రమించబోమని ఆయన స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల హామీలపై చర్చించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. మంత్రి పొన్నం ప్రభాకర్ గారు చెప్పినట్లుగా వెంటనే విధివిధానాలతో కూడిన కమిటీని వేసి ఉద్యమకారులను గుర్తించాలి. విధివిధానాలు ప్రకటించి అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమకారుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి జిల్లా నుండి ఉద్యమకారులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. అక్కడ అమరవీరులకు నివాళులర్పించి మన గళాన్ని వినిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కొక్కుల ఆంజనేయులు, గుజ్జె దత్తద్రి, కర్నె లక్ష్మి, చిలుక శారద, బైరి గోదావరి, మల్లేశ్వరి, బల్ల చంద్రకళ, కొలిపాక విజయ, ఏనుగుల సప్న, గాజుల ఉమా తదితరులు పాల్గొన్నారు.



# ఐపీసీ చర్చ్ లో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం..

- మహిళలు అన్ని రంగాలలో రాణించాలి..
- జిల్లా వైద్యాధికారి రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ క్ష్మీజ చర్చ్ లో ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా వైద్యాధికారి (ఐవీఎఉ) రజిత హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ రజిత మాట్లాడుతూ.. మహిళలు ప్రతి రంగంలో ముందుండాలని పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో పనులు చేస్తూ ఉద్యోగ రంగంలో కూడా ముందుండాలని మహిళా దినోత్సవం సందర్భంగా సూచించారు. మహిళలు వంట రూమ్ కి పరిమితం కాకుండా ప్రతి రంగంలో దూసుకుపోవాలని. స్వయం ఉపాధితో పాటు ఉద్యోగ రంగం. నాయకత్వంలో కూడా ముందుండాలని మహిళలకు సూచించారు, మహిళ దినోత్సవం సందర్భంగా వాక్యోపదేశం చేసిన మహిళలకు శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత కేక్ కట్ చేసి స్వీట్ లను పంపిణీ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు వందమంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది కవి సమ్మేళనానికి కవితలు ఆహ్వానం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా మార్చి 18న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహిం చనున్నట్లు మానేరు రచయితల సంఘం ప్రతినిధులు డాక్టర్ కందేపి రాణీ ప్రసాద్, గెంట్యాల భూమేశ్, ఆడెపు లక్ష్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహించాలని మానేరు రచయితల సంఘం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన కవులు, రచయితలు తమ ఉగాది కవితలను పంపాలని కోరారు. ఆసక్తి గల కవులు కవితా గానం కూడా చేయవచ్చని, గానం చేసే కవితలను ముందుగానే తెలియజేయాలని సూచించారు.

పండుగ నేపథ్యం, ఉగాది ప్రాశస్త్యం, జనజీవనం, ఋతువుల మార్పుల ప్రభావం, భవిష్యత్ సామాజిక జీవనం వంటి అంశాలపై సృజనాత్మకతతో కూడిన కవితలను రాయాలని తెలిపారు. కవితలు మూస ధోరణికి భిన్నంగా, నవ్యత్వంతో ఉండాలని పేర్కొన్నారు. ఎంపిక చేసిన కవితలను మాత్రమే కార్యక్రమంలో గానం చేయడానికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. కవులు తమ కవితలను మార్చి 15లోపు 98491 57752 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. గతంలో గానం చేసినవి లేదా పత్రికల్లో ప్రచురితమైన కవితలు కాకుండా కొత్తగా రచించిన కవితలను మాత్రమే పంపాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రతి కవికి సంఘం తరపున సత్కారం ఉంటుందని, గడువు తర్వాత అందిన కవితలను పరిశీలించబోమని నిర్వాహకులు వెల్లడించారు.



# 14-15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్...
- సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ పంపిణీ ప్రారంభం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ వేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 1, 2011 నుండి మార్చి 31, 2012 మధ్య జన్మించిన బాలికలందరూ ఈ వ్యాక్సిన్‌కు అర్హులని తెలిపారు. జిల్లాలో మొత్తం 3,773 మంది బాలికలను ఈ వ్యాక్సిన్ కోసం గుర్తించారు. సిరిసిల్ల జిల్లా ప్రధాన ఆసుపత్రి, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పంపిణీ అందుబాటులో ఉంది. బాలికల తల్లిదండ్రులు బాధ్యతగా గుర్తింపు కార్డులతో వచ్చి తమ పిల్లలకు టీకా వేయించి, సర్టిఫికెట్లు తీసుకోవాలని కోరారు. వ్యాక్సినేషన్ అనంతరం ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ కేక్ కట్ చేసి జిల్లాలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల ఆరోగ్యం మరియు రక్షణ పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, డీఎంహెచ్ఓ రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్ కుమార్ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# మినీ స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మినీ స్టేడియంలో మహిళా వాలీబాల్ క్రీడాకారిణులు మరియు విద్యార్థినుల సమక్షంలో వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను, క్రీడల్లో వారి ప్రతిభను చాటిచెప్పేలా సాగింది. మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలకు కేవలం వేడుకలే కాకుండా, మానసిక ఉల్లాసం కోసం పలు రిక్రియేషన్ గేమ్స్ నిర్వహించారు. క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీల్లో బాలికలు చురుగ్గా పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల అనంతరం పలువురు విద్యార్థినులు మహిళా దినోత్సవ ప్రాముఖ్యతపై ప్రసంగించి, సమాజంలో మహిళల పాత్రను కొనియాడారు.

క్రీడల్లో గెలుపొందిన విజేతలకు మరియు పాల్గొన్న బాలికలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళామణుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించారు. జిల్లా క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై, బాలికలకు బహుమతులు ప్రదానం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల శాఖ సిబ్బంది, వివిధ క్రీడల కోచ్‌లు మరియు పెద్ద సంఖ్యలో హాజరైన బాలికలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో, ముఖ్యంగా క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు.

# ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ

- **స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టాలి**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి తెలంగాణలో అన్ని సౌకర్యాలతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడంతో పాటు ఒలింపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటేలా క్రీడా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

క్రీడలకు అవసరమైన మైదానాలు, యూనివర్సిటీ, శిక్షణ తదితర అంశాలపై క్రీడాశాఖకు సంబంధించి నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ లో అంతర్జాతీయ ప్రమాణాల మైదానాలు, ఆధునిక సౌకర్యాలు కల్పించడంపై సమావేశంలో చర్చించారు. నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు.

గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించడంతో పాటు స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, క్రీడాకారుల శిక్షణ, పోటీల నిర్వహణకు అనుగుణంగా ఆధునీకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కిషోర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.క్రీడా శాఖపై సమావేశం

### రాహుల్ బంధు' పేరుతో

# రైతు బంధు నిధుల మళ్లింపు..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకోవడానికి రాహుల్ గాంధీకి మరియు ఆయన కుటుంబానికి డబ్బులు పంపుతున్నారని, సామంతు రాజుల మాదిరిగా ఢిల్లీకి కప్పం కడుతున్నట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇందుకోసం పేదల భూములను తీసుకొని, పేదల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు పలు ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూల్చి వ్యాపార ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని అన్నారు.

తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పార్టీ నేతలు తెలంగాణకు వచ్చి 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి, తెలంగాణ ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెడతామని తెలిపారు. ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిం దేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకు మద్దతు ఇవ్వాల్సి వస్తుందని, ఎందుకంటే తమ సొంత నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన మాటలనే తాము అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని అన్నారు .

# 'ట్రంప్... వారి కళ్లలోకి చూసి చెప్పండి'

(మొదటి పేజీ తరువాయి)

కథనాన్ని ప్రచురించింది. ఈ దాడి నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆ పత్రిక తీవ్రంగా విమర్శించింది. ట్రంప్ వ్యాఖ్యలు అసత్యాలతో నిండిపోయాయని, జరిగిన ఘటనలకు బాధ్యత తప్పించుకునే ప్రయత్నంగా ఉన్నాయని ఎడిటోరియల్‌లో పేర్కొంది.

**దాడికి ఇరాన్‌నే బాధ్యుడని ట్రంప్**

మినాబ్‌లోని ప్రాథమిక పాఠశాలపై జరిగిన క్షిపణి దాడికి ఇరాన్‌నే కారణమని ట్రంప్ ఆరోపించారు. "ఇరాన్ ఆయుధాలు చాలా అచ్చుతప్పుగా పనిచేస్తాయి. కాబట్టి ఈ దాడి కూడా వారివల్లే జరిగి ఉండొచ్చు" అని ఆయన మీడియాతో అన్నారు. అయితే న్యూయార్క్ టైమ్స్ చేసిన పరిశోధనలో ఈ దాడికి అమెరికా సైన్యమే ఎక్కువగా బాధ్యురాలై ఉండే అవకాశం ఉందని తేలింది. ఈ ఘటనపై అమెరికా లేదా ఇజ్రాయెల్ ఎవరూ అధికారికంగా బాధ్యత స్వీకరించలేదు.

**వందల మంది మృతి**

ఫిబ్రవరి 28న మినాబ్‌లోని ఒక సైనిక స్థావరంపై జరిగిన క్షిపణి దాడిలో అక్కడ ఉన్న లేదా పక్కనే ఉన్న పాఠశాల కూడా దెబ్బతింది. ఈ ఘటనలో 150 మందికి పైగా మృతి చెందినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు, వీరిలో ఎక్కువ మంది చిన్నారులే ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ సంఖ్యను స్వతంత్రంగా ధృవీకరించలేదని అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

డచ్ ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థ బెల్లింగ్‌క్యాట్కు చెందిన పరిశోధకుడు ట్రెవర్ బాల్ ఈ ఘటనపై విశ్లేషణ చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎలో ఆయన విడుదల చేసిన వీడియోలు, చిత్రాల ఆధారంగా ఈ దాడి టొమాహాక్ క్రూయిజ్ క్షిపణితో జరిగినట్లు అనుమానిస్తున్నారు.

ఆ వీడియోలను ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ ఏజెన్సీ ప్రసారం చేసినట్లు తెలిపారు. అందులో క్షిపణి సైనిక స్థావరంలోని భవనాన్ని ఢీకొట్టిన దృశ్యాలు కనిపిస్తున్నాయని చెప్పారు.

టొమాహాక్ క్షిపణులు ప్రస్తుతం ఈ ఘర్షణలో పాల్గొంటున్న దేశాల్లో అమెరికాకే ఉన్నాయని, ఇజ్రాయెల్ వద్ద అవి లేవని విశ్లేషకులు చెబుతున్నారు. వీడియోలో కనిపించిన క్షిపణి ఆకృతి కూడా టొమాహాక్‌తో సరిపోతుందని బాల్ పేర్కొన్నారు.

ఈ దాడి జరిగిన ప్రదేశాన్ని భౌగోళికంగా గుర్తించినట్లు కూడా ఆయన తెలిపారు. దీంతో ఈ ఘటనపై ట్రంప్ చేసిన ఆరోపణలకు విరుద్ధంగా కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో వినోద్‌కుమార్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ బొయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లిలిఆరూరి రమేష్‌బాబులిలి సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

భేటీ అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దాదాపు లిలి40 ఏళ్లుగా కొనసాగుతోందనిలిలి తెలిపారు. అయితే పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఫ్యాక్టరీ కోసం స్థానిక నాయకులు రైతులతో మాట్లాడి తక్కువ ధరకు భూములు ఇవ్వడానికి ఒప్పించారని వివరించారు. అయితే ప్రస్తుతం ఫ్యాక్టరీ పనుల్లో స్థానికులకు కాకుండా ప్రైవేట్ సంస్థల ద్వారా పనులు జరుగుతున్నాయని రైల్వే జీఎం చెప్పినట్లు తెలిపారు. స్థానికులకు కూడా ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని తాము కోరినట్లు చెప్పారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు విషయంపై తుది నిర్ణయం లిలిరైల్వే బోర్డు తీసుకుంటుందనిలిలి జీఎం తెలిపినట్లు వెల్లడించారు. లాతూర్‌లో భూములు కోల్పోయిన స్థానికులకు ఇచ్చినట్లే కాజీపేటలో కూడా భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# రోడ్లు విస్తరించాలి.. చెరువులు పునరుద్ధరించాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా చెరువులో గంగమ్మతల్లికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం స్థానికులతో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

దేశంలోని మెట్రో నగరాల్లో హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరంగా గుర్తింపు పొందిందని సీఎం పేర్కొన్నారు. అయితే నగరంలో ఆక్రమణలను తొలగించి, కాలుష్యాన్ని తగ్గించి మూసీ నదిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని హెచ్చరించారు. హైడ్రా ఏర్పాటు చేసిన సమయంలో తనపై ఎన్నో విమర్శలు వచ్చినప్పటికీ ప్రజల సంక్షేమం కోసం ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. నల్లచెరువు పునరుద్ధరణ తర్వాత వేలాది మంది ప్రజల ముఖాల్లో ఆనందం చూడటం సంతోషాన్ని కలిగించిందన్నారు. పునరుద్ధరించిన చెరువుల చుట్టూ పార్కులు, వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువుల ఒడ్డున పిల్లలు ఆడుకునే క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతంలోని అన్ని చెరువులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అభివృద్ధి పనుల సమయంలో కొందరికి నష్టం కలిగే అవకాశం ఉందని, పేదవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయబోమన్నారు. అవసరమైతే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి, నిజంగా నష్టం జరిగిన వారికి నష్టపరిహారం అందిస్తామని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, ఉత్తరప్రదేశ్‌లో గంగా రివర్ ఫ్రంట్ నిర్మాణాల మాదిరిగా మూసీ నదిని కూడా ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం మాజీ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ నవీన్ రావు, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారమైనట్టే. సమస్య అర్థంకానప్పుడు వేగంగా పరిష్కరించాలని ప్రయత్నించినా ప్రయోజనం ఉండదు.ఉద్యోగం వచ్చింది కదా అని సమాజంతో పనిలేదన్న భావన రావొద్దు. బాధ్యత మరింతగా పెరిగిందని గుర్తించాలి. ఉద్యోగం వచ్చిందని ఆటో మోడ్‌లోకి వెళ్లి రిలాక్స్ అయ్యారంటే నష్టం జరుగుతుంది.

దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా లాంటి మెట్రోపాలిటన్ నగరాలు అనేక సమస్యలతో సతమతవుతున్నాయి. మెట్రో నగరాల్లోని పరిస్థితులను పోలీసు శాఖ కచ్చితంగా నేర్చుకోవలసిన అంశాలున్నాయి. ప్రజలు సమస్య వచ్చినప్పుడు మొట్టమొదటగా సహాయం కోసం చూసేది పోలీసుల వైపే. అది పోలీసుల్లోని మంచి తనం కావొచ్చు. వ్యవస్థ కావొచ్చు. తీవ్రవాదం లేదా ఇతర సమస్యలను ఎదుర్కొనడానికి గ్రేహౌండ్స్, ఆక్టోపస్, నార్కోటిక్స్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఇలా రకరకాల వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. సిబ్బంది విషయంలోనూ అనేక సమస్యలున్నాయి. తక్కువ జనాభా ఉన్న ప్రాంతానికి ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతానికి ఒకే విధంగా సిబ్బంది కేటాయించడంకన్నా జనాభా ప్రాతిపదికన సిబ్బంది రేషనలైజేషన్‌పై ఆలోచనలు చేయండి.శాఖాపరంగా చర్చించుకుని మానవ వనరులను ఒక పద్ధతి ప్రకారం వినియోగించుకోవాలి. ఒక పర్పస్ కోసం ఒక ఫోర్స్‌ను తయారు చేసిన తర్వాత ఆ పర్పస్ పరిష్కారమైన తర్వాత ఆ ఫోర్స్‌ను ఇతరత్రా వినియోగించడంపై సమీక్ష చేయాలి.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడమే కాకుండా నేర పరిశోధన, ఇతరత్రా పోలీసు శాఖలో ఉన్న సమాచారానికి సంబంధించిన డేటాను క్ష్మీజజజ కంట్రోల్ రూమ్‌తో కనెక్ట్ చేయాలి. ఏ పోలీస్ స్టేషన్‌లో ఏ సమాచారం కావాలన్నా నిమిషాల్లో ఆన్‌లైన్‌లో పొందే విధంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునేలా ఉండాలి.ఉన్నతస్థాయిలో ఉన్న అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో అనుసంధానం ఏర్పాటు చేసుకోగలిగితే కిందిస్థాయిలో ఉండే సమస్యలు అర్థమవుతాయి. పోలీస్ శాఖ మానవీయ దృక్పథం కలిగి ఉండాలి. కింది స్థాయి సిబ్బందికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చినప్పుడే మంచి ఫలితాలు, గుర్తింపు వస్తుంది.

2002 సంవత్సరంలో పోలీస్ రిట్రీట్ కార్యక్రమం తర్వాత ఇప్పుడు మళ్లీ రిట్రీట్ జరుపుకుంటున్నాం. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, నేరాలు, నేరాల స్వరూపం చర్చించుకుని అవగాహన కల్పించినప్పుడు తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడుతుంది.." అని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి గారు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ గారు, డీజీ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్), డైరెక్టర్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ గారు, RBVRR TGPA డైరెక్టర్ అభిలాష బిష్త్ గారితో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బోర్డు పరీక్షల్లో చాట్‌జీపీటీ సహాయంతో చీటింగ్

**బలగం టీవీ, ముంబై**

మహారాష్ట్రలో 10వ, 12వ తరగతి బోర్డు పరీక్షల్లో విద్యార్థులు లిలిచాట్‌జీపీటీలిలి సహాయంతో మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో విద్యార్థులకు సహకరించారన్న ఆరోపణలపై బీడ్ జిల్లాలో లిలి81 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం సస్పెండ్ చేసిందిలిలి. బోర్డు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై రాష్ట్ర విద్యా మండలి వివిధ జిల్లాల్లో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అత్యధికంగా బీడ్ జిల్లాలోనే ఉపాధ్యాయుల సస్పెన్షన్లు నమోదయ్యాయి.

10వ, 12వ తరగతి పరీక్షల సమయంలో కొంతమంది విద్యార్థులు చీటింగ్‌కు పాల్పడినట్టు గుర్తించిన అధికారులు, ఈ వ్యవహారంలో కొందరు ఉపాధ్యాయులు కూడా సహకరించినట్లు తేలిందని తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. భవిష్యత్తులో బోర్డు పరీక్షల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.